“ఒరే మధూ. ఈ స్వీట్‌నీదే. ఈ సుధనీదే. నువ్వంటే ఎన్నాళ్ళనుంచో పాపం ..... ఇష్టంరా ..... ఎంజాయ్” మధూని సుధాని ఓ సూట్లోకి తోసేసి, పక్క సూట్లోకి మిత్రులందరూ వెళ్ళిపోయారు. ఎక్కడకొచ్చారో, ఏం చేస్తున్నారో ఏమీ తెలియని స్థితి.

“ఒ. కే. ..... ఒ.కే. థాంక్స్ రా ..... ఫ్రెండ్స్, ఫ్రెండ్స్ అంటే మీరు మీరేరా ..... ఫ్రెండ్స్ అంటే ..... ” సూట్లోకి వెళ్ళగానే సోఫామీద వాలిపోయాడు మధుకర్.

అలాంటి సమయంకోసం ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూస్తోంది సుధారాణి ఆమె కూడా నిషాలో వున్నా, ఆమెలోని స్త్రీ మాత్రం నిషా పొరల్లోంచి బయటకొచ్చింది.

చీకట్లో నెమ్మదిగా మధు పక్క కెళ్ళి అతని బుగ్గలమీద ముద్దు పెట్టుకుంటూ-

“ఐ లవ్ యూ ..... మధూ ..... మధూ ..... డూ యూ లవ్ మీ మధు. మధు ..... ఏయ్ ..... నిన్నే కమాన్ ఎంజాయ్ ..... ” అతని ముఖాన్ని ముద్దులతో నింపేస్తూ అతన్ని అల్లుకుపోతుంది. మధుకర్‌లో వచక్షణాజ్ఞానం పూర్తిగా నశించిపోతుంది. ఎన్నో ఏళ్ళుగా తన శరీరం ఏ బలహీనతలకు అలవాటుపడి పోయిందో- అవి ఒక్కసారి అతడ్ని చుట్టుముట్టగా వివశుడైపోయాడు. తనకందుబాటులోకి వచ్చిన ఆకారాన్ని తనకేసి లాక్కున్నాడు. క్షణాలు ..... నిమిషాలు క్రమంగా ఆ చీకటిగది నిశ్శబ్దంలో కరిగిపోసాగాయి. అర్ధరాత్రి దాటి అరగంటయింది. తనెక్కడున్నాడో తెలీని స్థితిలో మధుకర్ కార్పెట్ మీద పడుకున్నాడు. సుధారాణి మరోపక్క పడుకుండి పోయింది.

* * * *

ముందుగా మేల్కొన్న మధుకర్ బద్ధకంగా లేచి నలువేపులా చూశాడు.

పరిస్థితి, పరిసరాలు అర్థమైపోయి ఒక్కసారి కృంగిపోయాడు.

ఒంటిమీద బట్టలున్నాయో లేదో తెలీని స్థితిలో కార్పెట్ మీద వెల్లికిలా పడుకుని- వున్న సుధారాణిని చూడగానే తనమీద తనకే తెలీని అసహ్యం పుట్టుకొచ్చింది.

వడివడిగా ఆమెని సమీపించి నిద్రలేపే ప్రయత్నంచేసి విఫలమయ్యాడు.

తను చేసిన రెండు తప్పులు మహతి రూపంలో అవహేళన చేస్తున్నట్లుగా అనిపించింది. ఆ సమయంలో అక్కడకు మహతివస్తే? తననా పరిస్థితిలో చూస్తే? పిడికిళ్ళు బిగించి నుదుటిని కొట్టుకున్నాడు. చేసిన రెండు తప్పులు అతడ్ని దహించి వేస్తుండగా, డోర్ వేపు నడిచి దాన్ని తెరిచేందుకు ప్రయత్నించి- అది రాకపోవడంతో ఉలిక్కిపడ్డాడు. లోపల గడియ వేసిలేదు.

అయినా తలుపు తెరుచుకోవటం లేదంటే ..... బయట ఎవరన్నా వేసి ఉంటారా? ఎందుకిలా జరిగింది?

త్వర త్వరగా ఫోన్ దగ్గరకు నడిచి రిసెప్షన్‌కి రింగ్ చేసాడు. నో రెస్పాన్స్- కొద్ది క్షణాలకు గాని అది డెడ్ అయిందని తెలుసుకోలేకపోయాడు.

గెలుపుకోసం పరిగేడుతూ-- తనని తానే ఓడించుకున్న పరాజితుడు తను.

జరిగిన విషయం మహతి దృష్టికి వెళ్ళకుండా చూసుకుంటే? తన ఆలోచనకు తానే ఉలిక్కిపడ్డాడు. అది గెలుపవుతుందా? ఆత్మవంచనతో కూడుకున్న విజయం తనకి సంతృప్తినిస్తుందా? వూహు-- మరెలా జరిగిన తప్పుని సరిదిద్దుకోవటం? ఒకవేళ నిజంగా తను మహతి కన్నా ఎక్కువ సంపాదించినా గెలుపు తనదే అని చెప్పుకోగలడా? లేదు. గంటసేపు అలాగే మధనపడి-- సోఫాలో కూర్చొని జరిగిందంతా మహతినీ ఉద్దేశించి హోటల్‌లో లెటర్‌పేడ్‌మీద రాసి, మరోసారి చదువుకున్నాడు.

మందు తాగటం ఒక తప్పు. ఆ తప్పు ప్రేరేపిస్తే మరో తప్పు చేయటం మరో తప్పు ఆ రెండు తప్పులు చేసినందుకు క్షమించమని మహతికి రాసిన లెటర్ అది. దాన్ని కవర్‌లో పెట్టి మూసేసి, ఒక జగ్గు నీళ్ళు తెచ్చి సుధారాణి మీద పోశాడు. ఆమె దిగ్గున లేచింది.

లేచిన ఆమెవేపు అసహ్యంగా చూస్తూ తలుపు దగ్గరకు వెళ్ళితట్టాడు గట్టిగా.

రెండు మూడు సార్లు తట్టాక తలుపులు తెరుచుకున్నాయి. ఎదురుగా మహతి.

ముందేం జరిగిందో అర్థం కాలేదు మధుకర్‌కి- అర్థం కాగానే పాతాళంలోకి కృంగిపోయిన ఫీలింగ్ ..... సిగ్గుతో తలవంచుకున్నాడు. పరిస్థితిని అర్థం చేసుకున్న సుధారాణి అక్కడినుంచి వడిగా తప్పుకుంది. ఇద్దరిమధ్య కొద్ది నిమిషాలు నిశ్శబ్దం-- ముందుగా తేరుకున్న మధుకర్ తన జేబులో ఉంచుకున్న కవర్‌ని ఆమెకిచ్చాడు.

దాన్ని మౌనంగా తీసుకొని చదివింది మహతి.

“శెభాష్. పాత మధుకర్‌లా నాకేం తెలీదనో-నేనేం చేయలేదనో అంటావని ఊహించాను” అంది మహతి గంభీరంగా.

మధుకర్ చటుక్కున మహతి చేతులు పట్టుకొని “ఐ యామ్ సారీ” అని అన్నాడు పశ్చాత్తాపంతో దహించుకుపోతూ. మహతి మాట్లాడలేదు.

“రియల్లీ ..... మహీ. ఇది కావాలని చేయలేదు. నాకా దృష్టేలేదు. గెలుపు నీదే. విన్నింగ్ పోస్ట్‌వరకు వెళ్ళకుండానే నా ఓటమిని అంగీకరిస్తున్నాను. నన్ను క్షమించు” అంటూ అక్కడి నుంచి తప్పుకోబోయాడు. మహతి ముందు ఒక్క క్షణమైనా నించోలేక పోతున్నాడు.

వెళ్ళబోయిన మధుకర్‌ని మహతి ఆపింది.

“చేసింది తప్పని- ఒప్పుకున్నావ్. నేనే వచ్చి తలుపు తీస్తానని ఊహించని నువ్వు. అప్పటికే తప్పుని ఒప్పుకుంటూ లెటర్ రాసావ్. కనుక నిన్ను నేను నమ్ముతున్నాను. నీకు మరో అవకాశం ఇస్తున్నాను. పరుగు ఆపి మరో తప్పు చేయకు. చివరిదాకా పరిగెట్టు! నువ్వు గెలవాలనే నా ఆకాంక్ష” అంది మహతి తల వంచుకుని నేలచూపులు చూస్తున్న మధుకర్‌కేసి చూస్తూ. మధుకర్ చటుక్కున తలెత్తి మహతివేపు చూశాడు నిజమా అన్నట్లు.

* * * *

ఆఫీసులో కూర్చున్నాడన్న మాటేగాని మధుకర్ తన పనిమీద దృష్టిని కేంద్రీకరించలేక పోతున్నాడు. అప్పుడు మోగింది ఫోన్. చటుక్కున ఫోనెత్తాడు మధుకర్.

“నేను మహతిని” అని వినిపించింది ఫోన్‌కి ఆ వేపునుంచి.   మధుకర్ ఉలిక్కిపడ్డాడు.

“సా --- సారీ --- మహీ” హీన స్వరంతో అన్నాడు మధుకర్.

“తాగటం అనే తప్పు నువ్వు చేశావు. ఆ తాగుడు ఇచ్చే నిషా నిన్ను వేరే తప్పుకి ప్రేరేపించింది. అవునా?”

“అ -- అవును --- బట్ -- తప్పు తప్పే ---- ఒప్పుకుంటున్నాను. దాని ప్రేరణతోనే రెండో తప్పు చేసాను ..... ” బాధగా అన్నాడు మధుకర్.

“ఒక తప్పు చేసే అవకాశమే నీకిచ్చాను-అదీ నిన్ను నమ్మి---”

మహతి అన్నది ఒక్క క్షణం అర్థం కాలేదు మధుకర్‌కి.

“అర్థం కాలేదు” ఈసారి చిన్నగా నవ్వుతూ అంది మహతి.

“లేదు” అన్నాడు మధుకర్ పిచ్చెక్కిపోతూ.

“పూర్--- సుధారాణి” తిరిగింది నవ్వుతూనే.

మరింత పిచ్చెత్తిపోయాడు మధుకర్.

“అర్థం కాలేదా? ముద్దు - సుధారాణి ఆశపడిన పడక నాది కదా! అందుకే నాది అనుకున్న దాన్ని నేను స్వంతం చేసుకున్నాను.”

“అంటే- రాత్రి నేను - సుధారాణిని ఏమీ చెయ్యలేదా?” దిగ్భ్రాంతికి గురవుతూ అన్నాడు మధుకర్.

“అదేకదా నేను చెప్పేది” అంది మహతి ఆ వేపునుంచి.

అంటే - రాత్రి - తను కలిసింది మహతినా?

అదెలా సంభవం? హేట్సాఫ్ టూ యూ మహీ-- హేట్సాఫ్ అని అనుకున్నాడు మనస్సులోనే-- ఒకసారి నిస్సహాయతతో తనను భరించింది. ఈసారి తను దారి తప్పకూడదని మోసింది. కళ్ళు చెమర్చాయి మధుకర్‌కి. కొన్ని గంటల క్రితం అయితే మహతి మనసు కుతకుతలాడి పోయింది. పాత అలవాట్లకు, పాత పద్ధతులకు మధుకర్ స్వస్తి చెప్పాడనుకుంది. కానీ ఎదురయిన పరిస్థితి పట్ల, తన నిర్ణయాన్ని నిర్ణయించుకోలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడింది.

మధుకర్ నిజంగా మారతాడని నమ్మి, తనను తాను మోసం చేసుకుందా? తల్లితండ్రుల దృష్టిలో తను 'ఫూల్' అవుతుందా? ఏ నిజాన్నయితే నమ్మి, తను రోడ్డుమీద కొచ్చిందో, ఆ నిజం అబద్ధమని తేలితే-- తనేమైపోతుంది, తన బతుకేమైపోతుంది.

ఆ చీకటిరాత్రి నిస్సహాయతవల్ల పొంగుకొచ్చిన దు:ఖంతో ఆమె మూగగా అయిపోయింది-- ఆ రాత్రి అలాగే మధుకర్‌ని భరించింది. అద్దాల మేడలా కాపాడుకుంటున్న తన వ్యక్తిత్వం, చప్పున కూలిపోతున్నట్టుగా భావించింది. కాని ఉదయానికి తేరుకుంది. ఆ రాత్రి కావాలనే సుధారాణిని అక్కడే ఆ గదిలోనే వుండేలా చూసింది. మత్తు దిగిన మరుక్షణం ఆమెని చూసి తాను చేసిన తప్పు తెలుసుకోవాలనే అలా చేసింది.

"ఓ.కే మధు! ఎందుకు, ఏమిటి, ఎలా జరిగింది అన్న ప్రశ్నలు ఇప్పుడనవసరం. ఏ ఆశయ సాధనకయినా, బేసిక్‌గా కావలసింది డిసిప్లిన్! మనం సాధించాల్సిన లక్ష్యానికి గడువు ఇంకా మూడునెలలే ఉంది. నీ ఇష్టం.నువ్వు మళ్ళీ నీ పాత వ్యామోహాలే కావాలనుకుంటే, నేను నీకేం అడ్డుగా నిలవను. గో ఇన్ యువర్ ఓన్ వే ..... " ఆ మాటలనేసి ఫోన్‌ని డిస్కనెక్ట్ చేసింది

*　　　*　　　*　　　*

రూమ్ కొచ్చి మొహం కడుక్కొని, గది మధ్యలో కూర్చున్నాడు. అప్పుడు సమయం రెండుగంటలయింది. జన్నీ ఫాబ్రిక్స్ యాడ్ మెటీరియల్ అందుకున్నాడు. రకరకాల ఫోజుల్లో వున్న నాగార్జున ఫోటోల్ని చూశాడు. పేపర్స్, పెన్ను తీసుకున్నాడు. రఫ్ డిజైన్ తయారు చెయ్యడం ప్రారంభించాడు. కేప్షన్స్, బాడీ మేటర్ తయారు చేస్తూనే వున్నాడు. రాత్రంతా మరో ధ్యాస లేదు. పాతిక రకాల

స్కెచ్‌లు, కేప్షన్స్ తయారయ్యాయి. అందులో తనకు నచ్చిన కొన్నింటికి మరికొన్ని మార్పులు చేశాడు.

*　　　　*　　　　*　　　　*

* You too can have jenny like mine.
* A 'jenny' is forever
* I am only here for only 'jenny'
* నాకు ఇష్టమైన రెండే రెండు.
* ఒకటి అన్నపూర్ణా స్టూడియోస్. రెండు జెన్నీ ఫాబ్రిక్స్ .....
* నాగార్జునని నాగార్జునలా చూపెట్టేది 'జెన్నీ'
* నాగార్జున ది ఓన్లీ హీరో ..... 'జెన్నీ' ది ఓన్లీ డ్రెస్ .....

రఫ్ స్కెచ్, కాప్షన్స్‌తో మధుకర్ అందిస్తున్న ఒక్కొక్క కాపీని చూస్తున్నాడు సుమదేవ్.

"నైస్, వెరీ నైస్! సాధ్యమైనంతవరకూ బాడీమేటర్‌ను తగ్గించు. బాడీ మేటర్‌తో యాడ్స్ ఇవ్వడం, ఓల్టు. ఒకే ఒక కాప్షన్‌తో, లేదా కేప్షన్‌లెస్ యాడ్స్" చెప్పాడు.

మధుకర్ తయారు చేసిన వాటిలో, కొన్నింటిని ప్రత్యేకంగా సెలక్ట్ చేశాడు.

"వండ్రఫుల్! అన్నీ బాగున్నాయి. కానీ నువ్వే బాగాలేవు. నీ కళ్ళెందుకు ఎర్రగా వున్నాయి? రాత్రంతా నిద్రలేదు కదూ?" అవునన్నట్టుగా తలూపాడతను. "వెళ్ళి రెస్టు తీసుకో! జెన్నీ ఫాబ్రిక్స్ వాళ్ళతో నేను మాట్లాడి మిగతా డిటైల్స్ వర్క్‌వుట్ చేస్తా!"

ఫిజికల్‌గానే కాదు, రాత్రి ఇన్సిడెంట్‌వల్ల మెంటల్‌గా కూడా బాగాలేదు మధుకర్. ఓ పది నిమిషాలు ఆఫీసులో గడిపి, రూమ్ కొచ్చేసాడు. అదే సమయంలో యాడ్స్ ఇండియా ఆఫీసులో మహతి జెన్నీ ఫాబ్రిక్స్ యాడ్ కాంపైన్ విషయమై సుమదేవ్‌తో డిస్‌కస్ చేస్తోంది.

*　　　　*　　　　*　　　　*

సరిగ్గా పదిహేను రోజుల తర్వాత--

దేశంలో అన్ని ప్రముఖ సినిమా పత్రికలు, డైలీ న్యూస్ పేపర్స్‌లో ఎక్కడ చూసినా .....

జన్నీ ..... జన్నీ ..... జన్నీ ఫాబ్రిక్స్ ఎడ్వర్టయిజ్‌మెంట్స్ .....

ఎక్కడ చూసినా సంచలనం. టెక్స్‌టైల్ ఇండస్ట్రీ ఆ యాడ్ కాంపైన్‌కి ఆశ్చర్యపోతోంది.

ఫేమస్ మిల్స్ ఓనర్లు జన్నీ డ్రెస్ మెటీరియల్ కోసం ఎంక్వయిరీలు మొదలుపెట్టారు. ఆ ఫాబ్రిక్స్ కంపెనీ మొదట హీరో నాగార్జునది అనుకొన్నారు కొందరు. ఆ జన్నీ ఫాబ్రిక్స్ వివరాల కోసం అన్నపూర్ణా స్టూడియోకివచ్చే ఫోన్‌కాల్స్ రోజురోజుకీ పెరుగుతున్నాయి.

అలాగే -- జెన్నీ ఫాబ్రిక్స్ హైద్రాబాద్ కొచ్చే ఫోన్లు ..... అన్నీ తనే స్వయంగా రిసీవ్ చేసు- కుంటోంది మహతి.

మద్రాస్, బోంబే, కలకత్తా, అహ్మదాబాద్, న్యూఢిల్లీ నుంచి తమకు డీలర్‌షిప్ కావాలని ఫోన్లు ..... వాళ్ళలో పాతికమందిని మాత్రమే సెలక్టు చేసింది మహతి. ఫోన్ ద్వారా ఎపాయింట్ మెంట్ ఫిక్స్ చేసింది. భువనగిరి నుంచి వచ్చిన రఘురామశెట్టికి ఈ తతంగం అంతా అనూహ్యంగా ఉంది. అద్భుతంగా అనిపించింది. మహతి ఒక మనిషిలా కనబడలేదాయనకు.

కంప్యూటర్‌లా ఉంది.

పేపర్‌యాడ్స్ చూసి స్టేట్‌లోని వివిధ సెంటర్స్‌నుంచి వచ్చిన బిజినెస్ మెన్స్‌తో మీటింగ్ పూర్తయ్యేసరికి ఆ రోజు రాత్రి పదకొండు గంటలయింది.

తనకేమీ పనిలేక రఘురామశెట్టి తన ఛాంబర్‌లో కూర్చున్నంత సేపు ఓపిగ్గా కూర్చుని ఆ తర్వాత నిద్రపోతున్నాడు.

విజిటర్స్ వెళ్ళిపోయాక టేబిల్‌మీదున్న ఫ్లాస్కులోంచి రెండు కప్పుల్లో టీ పోసుకొని రఘురామశెట్టి ఛాంబర్లో కెళ్ళింది మహతి.

డోర్ చప్పుడికి ఉలిక్కిపడి లేచాడాయన.

"సారీ అమ్మా!"

"ఫర్వాలేదు తీసుకోండి" ఆయనకో కప్పిచ్చి, ఎదురుగా కూర్చుని టీ తాగుతూ.

"భువనగిరి గోడౌన్స్‌లోని మన మెటీరియల్ మొత్తం వారంలోగా మూవ్ అయిపోవాలి. మనం ఎపాయింట్ చేసుకున్న ట్రైలర్స్‌కి అది అందాలి. ఇకపై కాలం కంటే వేగంగా మనం వర్క్ చేస్తేనే మన ప్రొడక్టు కున్న డిమాండ్‌ని మీట్ కాగలం."

చాలా సాదాగా ఏ మాత్రం ఉద్రేకం ప్రదర్శించకుండా అంది మహతి.

టీ తాగుతున్న శెట్టిగారు కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయాడు.

"రెండ్రోజుల్లో మెటీరియల్ లోడింగ్ కార్యక్రమం మొదలెట్టాలి. రేపుదయాన్నే మీరు భువనగిరి వెళ్ళిపోండి. ఆ తర్వాత నేనొస్తాను."

"అలాగేనమ్మా!" నెమ్మదిగా అన్నాడాయన.

* * * *

"నీ కోసమే వెయిట్ చేస్తున్నానోయ్!" డోర్ తీసికొని లోనికొస్తున్న మధుకర్ వేపు హేపీగా చూస్తూ అన్నాడు సుమదేవ్.

"ఏమిటి సార్ విశేషం? కొత్త కాంట్రాక్టు ఏమైనా వచ్చిందా?"

"ఏమైనా వచ్చిందా అని నెమ్మదిగా అంటావేవిటోయ్! ట్వంటీఫస్ట్ సెంచరీ ప్రొడక్ట్స్ యాడ్ కాంపైన్ అంతా మనకే వచ్చింది. ఆ క్రెడిట్ అంతా నీకేనోయ్! పేపర్ ఎడ్వర్టయిజ్ మెంట్ చూసి నువ్వే వాళ్ళతో డీల్ చేశావుగా ..... ఏ మాత్రం ఇన్‌ఫ్లుయన్స్ ఉపయోగించకుండానే మనకా కాంట్రాక్టు వొచ్చింది. ఆ ప్రొడక్ట్సు పేపర్, టి.వీ. హోర్డింగ్ టోటల్ మనం కోట్ చేసిన బడ్జెట్‌కు వాళ్ళు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇంత తక్కువ టైమ్‌లో అంత ప్రోగ్రెస్ సాధిస్తామని అనుకోలేదోయ్. ఇవాళ నాకంటే ప్రపంచంలో మరెవ్వరూ ఇంత ఆనందంగా ఉండరు".

“మధు! రేపు మార్నింగ్ బోంబే వెళుతున్నాం. బీ రెడీ!” అన్నాడు సుమదేవ్ ఉద్వేగంనుంచి తేరుకుంటూ.

“నేనెందుకు సర్?”

“ఇకనుంచి నేనిక్కడే ..... నువ్వు చెప్పిన పని చేస్తూ వుంటాను. ఎక్కడకెళ్ళాలన్నా నువ్వే.”

“సర్! మీరు నన్ను నిచ్చెన ఎక్కించేస్తున్నారు” నవ్వుతూ అన్నాడు మధుకర్.

“యూ డిజర్వ్‌ట్ మై బాయ్! ఎదిగేవాళ్ళు, ఎదుగుదలను కోరేవాళ్ళు సిగ్గుపడకూడదు. తమలో తాము కుంచించుకుపోగూడదు. బీ బ్రేవ్, బై ది బై ! నీకో సర్‌ప్రైజింగ్ న్యూస్ చెప్పనా?”

అంటూ ఇండియా టుడే కరెంట్ ఇష్యూ ముందుకు తోసాడు.

“ఏమిటి సర్ విశేషం?”

“ఏవిటో చూడు. 25వ పేజీ తియ్యి.” చకచకా పేజీలు తిప్పాడు మధుకర్.

ఇరవై అయిదవ పేజీలో-- జెన్నీ ఫాబ్రిక్స్‌కి కొత్త తరహా యాడ్ కాంపైన్‌ని క్రియేట్ చేసిన యాడ్ ఏజెన్సీ ‘యాడ్స్ ఇండియా’.

దాని కింద యాడ్ ఇండియా గురించి ఓ రెండు పారాగ్రాపులు రాసి, సుమదేవ్ గురించి, తర్వాత మధుకర్ గురించి రాశారు. స్టాంపు సైజులో మధుకర్ కలర్ ఫోటోకూడా వేసారు.

ఆ వార్తను చూసి “ఏంటి సార్ ఇదంతా? నా ఫోటో వీళ్ళకెవరిచ్చారు?” ఆశ్చర్యంగా అడిగాడు మధుకర్.

“వాళ్ళు లివింగ్‌మీడియా వాళ్ళోయ్! లివింగ్ జీనియస్సుల్ని ఆ మాత్రం పట్టుకోకపోతే వాళ్ళకు పేరే లేకపోను. యాడ్ వరల్డ్‌లోకి నోవల్టీని తెస్తున్న యంగ్ మీడియా మాన్‌గా నిన్నెలా పొగిడారో చూశావా?”

తన ఫోటోవేపు ఒకసారి చూసుకుని, సుమదేవ్ ముఖంలోకి ఒక సారి చూసాడు మధుకర్. యాడ్ మీడియాలో భీష్ముడిలాంటి వ్యక్తి సుమదేవ్. సుమదేవ్ ఒక మనిషిలోని క్రియేటివిటీని గుర్తిస్తే అతన్ని ఎలా ఎంకరేజ్ చేస్తాడో అన్నదానికి ఈ ఇన్సిడెంట్ నిదర్శనం.

అందుకే--